క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక

కంచిలి: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం సాయంత్రం వీరంతా సమావేశమయ్యారు. మండల అధ్యక్షుడిగా పసుపులేటి జగదీష్, ప్రధాన కార్యదర్శిగా లంక ప్రశాంత్, కోశాధికారిగా చింతల రాజ్‌కిషోర్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ ప్రతినిధులను మిగతా సభ్యులంతా అభినందించారు.

పథకాల అమలుపై సమీక్ష



పెద్ద శ్రీరాంపురం సచివాలయంలో సమీక్షిస్తున్న దృశ్యం

కంచిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, సర్వేలపై తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి.తిరుమలరావులు సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. ఈ మేరకు మండలంలోని మఖరాంపురం, పెద్దశ్రీరాంపురం గ్రామ సచివాలయాల్లో గురువారం సమీక్ష సమావేశాలు చేపట్టారు. పీఎం సూర్యఘర్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వే, హౌస్ టు హౌస్ జియో ట్యాగింగ్, పీజీఆర్ఎస్, మిస్సింగ్ సిటిజన్స్ సర్వే వంటి అంశాలపై సచివాలయ ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించారు. తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ డి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుల పరిశీలన



కల్వర్టు పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

సాక్షి ఎఫెక్ట్...

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రమాదకర రోడ్లు, కల్వర్టులపై 'ఆదమరిస్తే ప్రమాదమే..' అనే శీర్షికతో సాక్షి పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు కల్వర్టులను గురువారం పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న పరిస్థితులు ప్రదేశాల వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయనతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం రమేష్ తదితరులు

కంచిలి: మండలంలోని బెల్లుపడ గ్రామానికి చెందిన ఒబినిండి శ్రీజ ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో చక్కని ప్రతిభ కనబర్చి 96.7 పర్సంటైల్‌ను సాధించింది. ఈమె పదో తరగతి వరకు డోలగోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలోనే చదువుకుంది. ప్రస్తుతం విశాఖపట్నంలోని శ్రీభవిష్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. దీంతో డోలగోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఉప్పాడ రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థినిని గురువారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకులు సహకరించాలి



డీసీసీబీ బ్యాంకులో చర్చిస్తున్న ఏపీఎం ప్రసాదరావు

కంచిలి: స్వయంశక్తి సంఘాల సభ్యులు బ్యాంకుల్లో దాచుకున్న పొదుపులను అంతర్గత అప్పులుగా ఇచ్చేందుకు బ్యాంకులు సహకరించాలని మండల ఐకేపీ ఏపీఎం ఎస్.ప్రసాదరావు కోరారు. సోంపేట కేంద్రంగా ఉన్నటువంటి యూబీఐ, డీసీసీబీ బ్యాంకులు పొదుపులను అంతర్గత అప్పులుగా ఇచ్చేందుకు సహకరించడం లేదని సంఘ సభ్యుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయా బ్యాంకుల అధికారులను గురువారం కలిసి చర్చించారు. సంఘాలు తీర్మానాలు చేసి, బ్యాంకుకు సమర్పిస్తున్నట్లు తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీతోనే పథకాలు

కవిటి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీతోనే భవిష్యత్‌లో రైతులకు పథకాలు అందుతాయని మండల వ్యవసాయఅధికారి బడగల దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగ, కుసుంపురం గ్రామాల్లో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం అమలుతీరును గురువారం ఆయన పరిశీలించారు. ప్రతీ రైతు బాధ్యతగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు.

జీడి రైతుకు.. మంచు గండం..!



సస్యరక్షణ చర్యలు చేపడుతున్న రైతులు

- ఉద్దానం జీవనాడికి మంచు దెబ్బ
- సస్యరక్షణ పనుల్లో రైతులు
- కన్నెత్తి చూడని అధికారులు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)
మందస	3,500
పలాస	1,200
వజ్రపుకొత్తూరు	6,000

పలాస: ఉద్దాన ప్రాంతానికి జీవనాడిగా ఉన్నటువంటి జీడిపంటకు మంచుదెబ్బ తగిలింది. ఇటీవల కాలంలో రాత్రి సమయాల్లో కురుస్తున్న పొగమంచుతో బూజు తెగులు వచ్చే ప్రమాదం ఏర్పడింది. దీంతో సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. అయితే సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు ముఖ్యంగా నీటి అవసరం ఉంది. కానీ తోటల్లో బోరు సదుపాయాలు లేకపోవడంతో గ్రామాల నుంచి ట్రాక్టర్లపై డ్రమ్ములతో తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఫలితంగా ఆర్థిక భారం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పురుగు మందులు కూడా ప్రైవేటు దుకాణాల వద్దనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

నియోజకవర్గంలో...

పలాస నియోజకవర్గంలో మొత్తం 10,700 ఎకరాల్లో జీడి సాగు చేస్తున్నారు. అయితే ఈ ఉద్దాన ప్రాంతంలో రైతులకు ఎటువంటి అవగాహన సదస్సులను అధికారులు నిర్వహించలేదు. సస్యరక్షణ చర్యలపై పలాస ఉద్యానవన శాఖాధికారి శంకరదాసును వివరణ కోరగా.. ప్రస్తుతం ఉద్దానంలో నీటి మంచు బాగా పడుతోందని, పూత, మొగ్గ దశలో జీడి పంట ఉండడంతో బూజు తెగులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అందువలన తెగులు నివారణకు శాప్ పొడరును లీటరు నీటిలో ఒక గ్రాము కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పూత విచ్చుకున్న దశలో మోనోక్రోటోపాస్, పిక్కదశలో ప్రొపెనోపాస్ మందును పిచికారీ చేయాలన్నారు.

అవగాహన సదస్సులు పెట్టాలి



గ్రామాల్లో రైతులకు సంబంధిత అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలి. ఇంత వరకు గ్రామాలకు అధికారులు ఎవరూ రావడం లేదు. దీంతో రైతులు అవగాహన లేకుండా మందులు కొడుతున్నారు.

– తెప్పల అజయ్‌కుమార్, మాకన్నపల్లి, పలాస మండలం

గిట్టుబాటు అవ్వడం లేదు



జీడిపంటపైనే ఆధారపడుతున్న రైతులకు దిగుబడి గిట్టుబాటు కావడం లేదు. ఎరువులు, దుక్కులు, సస్యరక్షణ చర్యలు చేపట్టడానికి భారీగా ఖర్చులు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు.

– వంకల అప్పారావు, బొడ్డపాడు కాలనీ, పలాస మండలం



పూత దశలో జీడి పంట

దరఖాస్తుల ఆహ్వానం



మున్సిపల్ కమిషనర్ రమేష్

ఇచ్ఛాపురం: పట్టణంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు చెందినవారికి మెప్మా ఆధ్వర్యంలో స్కిల్ డవలప్‌మెంట్‌లో శిక్షణ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ అప్రెంటిషిప్ ట్రెనింగ్ స్కీమ్ (ఎన్ఏటీఎస్), ఆశ సొసైటీ వారిచే స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ కార్యాక్రమాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లతో పాటు స్టైఫండ్‌గా రూ.3,500లను అందజేయనున్నట్లు తెలిపారు. సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2021 తర్వాత డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని స్పష్టం చేశారు. ఆధార్, డిగ్రీ, ఇంటర్, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన సర్టిఫికెట్లతో ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేరాడ తిలక్ సంఘీభావం



డాక్టర్ జీవితేశ్వరరావుకు సంఘీభావం తెలుపుతున్న తిలక్ తదితరులు

కాశీబుగ్గ: పలాసలో రోడ్డు విస్తరణలో భాగంగా ఇందిరా చౌక్‌లో ఉన్నటువంటి ఇందిరాగాంధీ విగ్రహాన్ని తొలగించారు. అయితే తొలగించిన విగ్రహాన్ని తిరిగి నిర్మించాలని ప్రయత్నించినందుకు శస్త్ర చికిత్స వైద్య నిపుణుడు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావును పోలీసుస్టేషన్‌కు పిలిపించడం సరికాదని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయనను కలిసి సంఘీభావం తెలిపారు. పోలీసులు, అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నందిగాం మండలం ఎంపీపీ నడుపూడి శ్రీరామమూర్తి, మాజీ ఎంపీపీ కురమాన బాలకృష్ణ, నందిగాం సర్పంచ్ జడ్యాడ జయరాం, నందిగాం ఎంపీటీసీ బొడ్డు విష్ణు, కాపు తెంబూరు సర్పంచ్ పోలాకి మోహనరావు, కవిటి అగ్రహారం సర్పంచ్ బొమ్మాళి గున్నయ్య, కర్లపూడి సర్పంచ్ తమ్మిడి రాజు, నందిగాం మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తమ్మిడి ఫాల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు



గంజాయి అమ్మకాలు జరిపినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సోంపేట సీఐ బి.మంగరాజు స్పష్టం చేశారు. ఈ మేరకు పట్టణంలోని కవిటి రోడ్డులో ఉన్న అంబేడ్కర్ కాలనీలో గురువారం డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి అమ్మకాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని కోరారు. – సోంపేట

ఎలుగుదాడి బాధితులకు ఎక్స్‌గ్రేషియా



బాధితులకు చెక్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: ఎలుగుదాడికి గురైన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఎక్స్‌గ్రేషియాను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తన కార్యాలయంలో గురువారం అందజేశారు. ఎలుగు దాడిలో వజ్రపుకొత్తూరు మండలం గుణుపల్లి గ్రామంలోని జీడితోటలో పనిచేస్తున్న చిడిపల్లి లోకనాథం, కొండేటి కూర్మారావులు మృతి చెందగా, సావిత్రి అనే మహిళ తీవ్రగాయాలపాలైంది. దీంతో కాశీబుగ్గ ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణ సమక్షంలో మరణించినవారికి ఒక్కో కుటుంబానికి రూ.2.5 లక్షలు, గాయాలపాలైన వారికి రూ.1.36 లక్షల చెక్‌లు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కంచిలి: మండలంలోని కొన్నాయిపుట్టుగ గ్రామంలో వెలసిన కొనకేశ్వరి అమ్మవారి ఆలయం 41వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనతోపాటు పార్టీ నేతలు లడ్డుకేశవపాత్రో, స్థానిక నేతలు భైరవి సాహు, ఖిత్రోసాహు, గంగాధర్‌సాహు, చింతామణి కొన్నాయి, రూపుచంద్ర తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గ కేటీరోడ్డులో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గాంధీనగర్‌లో ఉన్న 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్టుకొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. కేటీ రోడ్డు, గుణ్ణేశ్వరనగర్, పల్లివీధి, తిలక్‌నగర్, ఆంధ్రాబ్యాంకు లైన్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు సహకరించాలని కోరారు.

మందస: మండల పరిధిలో ఉన్నటువంటి అన్ని పంచాయతీల్లో శుక్రవారం విద్యుత్ కోత విధించనున్నట్లు పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

రాగి జావతో ఆరోగ్యం



విద్యార్థులు ఆరోగ్యంగా, చురుకుగా ఉండేందుకు బడుల్లో ప్రవేశపెట్టిన రాగి జావ తాగాలని కొళిగాం హెచ్‌ఎం, క్లస్టర్ చైర్మన్ నరేంద్రనాథ్ పట్నాయక్ సూచించారు. మండలంలోని బొడ్డబడ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. రాగిజావ వలన బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో విద్యార్థులకు వండి పెట్టాలని నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. – ఇచ్ఛాపురం రూరల్

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం గోవింద్

కవిటి: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని ఏపీఎం కె.గోవింద్ ఆకాంక్షించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో మండల మహిళా సమాఖ్య సభ్యులకు రెండు రోజుల శిక్షణలో భాగంగా గురువారం దిశానిర్దేశం చేశారు. మండల మహిళా సమాఖ్యలో ఏడు సబ్ కమిటీలు ఉన్నాయన్నారు. వీరు సంబంధిత విభాగాలను పటిష్ఠం చేసే దిశగా పనిచేయాల్సి ఉందన్నారు. రికార్డుల నిర్వాహణ, నెలవారీ సమావేశాలు పక్కాగా జరిపించడం, రుణాల కల్పన, శతశాతం రుణాల రికవరీ, ప్రభుత్వ ప్రయోజిత కార్యక్రమాలను విజయవంతం చేయడం తదితర అంశాలపై శిక్షణలో ప్రధానంగా వివరించనున్నారు.

అందుబాటులోకి గుండెపోటు ఉచిత ఇంజెక్షన్లు

కాశీబుగ్గ: గుండెపోటుకు గురయ్యేవారికి అత్యవసర సమయంలో ఉపయోగించి ప్రాణాలు కాపాడే రూ.45 వేలు విలువ చేసే ఇంజెక్షన్లు, పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ అగ్గున మేఘన తెలియజేశారు. ఈ మేరకు గురువారం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడారు. ఛాతినొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి గుండెపోటు లక్షణాలు ఉన్నవారికి ఈ ఇంజెక్షన్ అందించనున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రికి చేరుకుంటే ఈసీజీ తీసి అనంతరం పరిస్థితి బట్టి అవసరమైతే టెనిక్టోప్లాస్-40 ఎంజీ ఇంజెక్షన్‌ను ఉచితంగా ఇస్తామన్నారు. రానున్న రోజుల్లో 108లలో సైతం అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

టెక్కలి: గుండెపోటుకు గురైనవారికి వైద్యం అందజేసేందుకు అత్యవసరమైన టెనిక్టోప్లాస్-40 ఎంజీ ఇంజెక్షన్‌ను టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందజేయనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైనవారు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

సమస్యలపై వినతి



కవిటి మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో విపరీతమైన పని ఒత్తిడితో సతమతమవుతున్న డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గం ఎన్నిక ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రాహి అధ్యక్షతన నిర్వహించారు. అధ్యక్షుడిగా లోళ్ల విజయ్, ప్రధాన కార్యదర్శిగా గన్ని హరీష్, ట్రెజరర్లుగా బెండి వికాస్ కృష్ణ, తోట జయదేవ్‌లు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దున్న నవీన్‌ను ఎన్నుకున్నారు. – కవిటి

విజయగౌరి విజయానికి కృషి చేయాలి



శిలగాం ఉన్నత పాఠశాలలో విజయగౌరి కరపత్రాలతో యూటీఎఫ్ నేతలు

కవిటి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కోరెడ్ల విజయ గౌరి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని బెలగాం, శిలగాం ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు చేస్తున్న విద్యారంగ సంస్కరణల వలన పేద పిల్లలు విద్యకు దూరమవుతున్నారన్నారు. దీనివలన అనేక పాఠశాలలు మూతపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయ గౌరిని గెలిపించుకుంటే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల కోసం పోరాటాలు సాగిస్తారని తెలియజేశారు. రాష్ట్ర కౌన్సిలర్ పొందూరు అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వాల విధానాలపై స్పష్టమైన వైఖరి కలిగి ఉండేటువంటి వ్యక్తి విజయ గౌరి అన్నారు. జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్ మాట్లాడుతూ గత 30 ఏళ్లు వివిధ ఉద్యమాల్లో ఉంటున్న ఆమెకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు జగదీష్, సీతమ్ నాయుడు, అశోక్, కలియ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న సీడాప్ మాజీ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి

కవిటి: మధ్య తరగతి విద్యార్థులు అత్యధికంగా ఉండేటువంటి కవిటి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి పునరుద్ఘాటించారు. గురువారం విజయవాడలో ఈ అంశంపై వాస్తవిక పరిస్థితిని వివరిస్తూ డైరెక్టర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ డాక్టర్ నారాయణ భరత్ గుప్త(ఐఏఎస్)ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇదే అంశంపై గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల బృందం నివేదిక అందించిందన్నారు. నివేదిక ప్రకారం తదుపరి కార్యాచరణ చేపట్టేందుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ కవిటిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు అంశంపై ప్రభుత్వ అనుమతుల కోసం నివేదిస్తామన్నారు.

అక్రమ నిర్మాణం తొలగించాలని నోటీసులు



అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వీఆర్వో తిరుపతిరావు

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: 'ఖాళీ స్థలాలపై ఆక్రమణదారుల కన్ను' అనే శీర్షికతో సాక్షి పత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఎస్.వెంకటరావు ఆదేశాల మేరకు ఈదుపురం వీఆర్వో అంపోలు తిరుపతిరావు, గ్రామ సర్వేయర్ కొర్రాయి హరిలు బాహుదా నది గట్టుపై అక్రమ నిర్మాణ స్థలానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. గట్టుకు ఆనించి సర్వే నంబర్ 253లో సెంటు భూమిని ఆక్రమించుకొని ఈదుపురం గ్రామానికి చెందిన దేవరాజు బెహరా అనే వ్యక్తి అక్రమంగా నిర్మాణం చేసినట్లు స్పష్టం చేశారు. వారం రోజుల్లో అక్రమ కట్టడాన్ని తొలగించాలని సంబంధిత వ్యక్తికి నోటీసులు ఇచ్చారు.

లేగ దూడలు పట్టివేత

టెక్కలి రూరల్: స్థానిక జగతిమెట్ట సమీపంలో గురువారం వేకువజామున టెక్కలి పోలీసులు అక్రమంగా తరలిస్తున్న లేగ దూడల వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. కంచిలి నుంచి కొంత మంది వ్యక్తులు సుమారు 10 లేగ దూడలను ఒక వ్యాన్‌లో నారాయణపురం సంతకు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని విజయనగరం సమీపంలోని గోశాలకు తరలించినట్లు తెలిపారు.

జాతీయ పోటీలకు టెక్కలి విద్యార్థిని



ఝాన్సీరాణి

టెక్కలి: ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు హిమాచల్ సెంట్రల్ యూనివర్సిటీలో జరగనున్న ఆలిండియా ఇంటర్ జోనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్.ఝాన్సీరాణి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వి.ల్యూక్‌పాల్, పీడీ బి.సత్యనారాయణ, కోచ్ వకుళాభరణం ఈశ్వరరావు తదితరులు అభినందించారు.